క్లుప్తంగా

ఒరిగిన స్తంభాలు నిలబెట్టారు!



నాదెండ్ల: గణపవరం శాంతినగర్‌లో విద్యుత్‌స్తంభాలు ఒరిగి ప్రమాదభరితంగా మారడంతో శనివారం సాక్షి దినపత్రికలో ఒరిగిన స్తంభాలు నిలబెట్టరూ అనే శీర్షిక ప్రచురితమైంది. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. ఆ శాఖ ఏఈ పీవీ ప్రసాద్ శనివారం ఉదయం ప్రొక్లెయినర్, సిబ్బందితో చేరుకుని ఒరిగిన స్తంభాన్ని యథాస్థానంలో ఉంచి మరమ్మతులు చేశారు. పునాది వద్ద కాంక్రీట్ ఫిల్లింగ్ చేశారు. ప్రమాదభరితంగా మారిన స్తంభాన్ని బాగుచేయటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు వైఎస్సార్ సీపీ అత్యవసర సమావేశం

నరసరావుపేట: గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం పేర్కొన్నారు. కావున అందరూ తప్పనిసరిగా పార్టీ కార్యాలయం వద్దకు రావాలని కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మండల విద్యాశాఖ అధికారి డి. బ్రహ్మేశ్వరరావు శనివారం పరిశీలించారు. వంటశాల పరిసరాలను తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులకు అందజేస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచి చూశారు. విద్యార్థులకు భోజన వడ్డన చేశారు. తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నాణ్యతా పరిమాణాలను మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. నిర్ణీత మెనూను విధిగా విద్యార్థులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

ఆకర్షణీయ చేతిరాతతో చక్కటి ఫలితాలు



నాదెండ్ల: చక్కటి చేతిరాతతో విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించటంతో పాటూ జీవితంలో అనేక రంగాల్లో ఎదిగేందుకు దోహదపడుతుందని ఆంగ్ల ఉపాధ్యాయురాలు బి. నాగశైలజారాణి చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 800 మంది విద్యార్థులు లుసిడా హ్యాండ్‌రైటింగ్‌తో రాణిస్తున్నారని ఆమె చెప్పారు. క్యాలిగ్రఫీలో లుసిడా హ్యాండ్‌రైటింగ్ ఎంతో ఆకర్షణీయమైనదని, ఐదు రకాల లుసిడా హ్యాండ్‌రైటింగ్స్‌లో విద్యార్థులకు శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. తాను పొత్తూరులో గణిత అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.రామ్మోహన్‌రావు వద్ద లుసిడా హ్యాండ్ రైటింగ్ నేర్చుకున్నానని, ప్రస్తుతం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్‌లో శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. తమ విద్యార్థులు పలు పోటీల్లో నెగ్గి పతకాలు సాధించారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణానాయక్, ఇన్‌చార్జి హెచ్ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి

నాదెండ్ల: దొంగతనానికి యత్నిస్తూ స్థానికులకు చిక్కిన దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన శుక్రవారం రాత్రి గణపవరం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కొత్త కోదండ రామాలయం సమీపంలోని గాలి బుచ్చయ్య ఇంటి డాబా మీదకు రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. స్థానికులు గమనించి అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలడిగితే తన పేరు శీను అని, తన ఊరు పోలవరం అని మాత్రమే చెప్పాడు. సదరు వ్యక్తి గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

భూ సమస్యలపై అర్జీల స్వీకరణ

బొల్లాపల్లి: మండలంలోని సీతారామ్‌పురం తండాలో తహసీల్దారు ఎ.వి.సుధాకర్, రెవెన్యూ సిబ్బంది శనివారం గ్రామ సభ నిర్వహించారు. తండా వాసుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. తహసీల్దారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు తండావాసుల భూ సమస్యలు పరిష్కరించేందుకు వారి నుంచి అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. 1996లో చెరువు పోరంబోకు సంబంధించి తండాలో కొందరికి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. వాటికి సంబంధించి పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. కలెక్టర్ సీతారామపురం తండా సందర్శించి భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు రావడంతో ఆయన ఆదేశాల మేరకు తండా వాసుల నుంచి అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దారు తెలిపారు.

చిట్టడవులు కావవి.. మాగాణి భూములు!!

- నకాలంలో నీరందక ఇలా బీడయ్యాయి
- తిరిగి సాగులోకి తేవాలంటే రైతన్నకు భారం
- ఆందోళనలో పలువురు రైతులు

మిన్నులోని చందమామ చేతిలో లేని మహిమ మన్నులో నుంచి అన్నం తీసే రైతన్న చేతుల్లో ఉంటుందట. 'మింటి చుక్కల్లో వాడు / చెమట చుక్కల్లో నువ్వు, అమావాస నెలవంక వాడు / ఉపవాస నెలవంక నువ్వు, నింగి వెన్నుపూస వాడు / నేల వెన్నుపూస నువ్వు'' అని కవి సుద్దాల మాట. అందరికీ అన్నం పెట్టే అలాంటి రైతన్నలు కొందరు సాగు చేయడానికి జంకుతున్నారు. వేళకు నీరందక, సాగు సాగకక మాగాణుల్లో నేడు పిచ్చిమొక్కలు రాజ్యమేలుతున్నాయి. చిట్టడవుల్లా మారిన ఆ భూములను మళ్లీ సాగు చేయాలంటే అది 'వ్యయ'సాయం అవుతుందే కాని వ్యవసాయం కాదని పలువురు రైతుల అభిప్రాయం.



మాగాణి పొలంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న జేసీబీ



చిట్ట అడవులను తలపిస్తున్న మాగాణులు

రొంపిచర్ల: చిట్టడవుల్లా పెరిగిన మాగాణి భూముల్లో వరిసాగు చేయాలంటే పెట్టుబడి పెరిగిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది నాగార్జున సాగర్‌లో మాగాణి పంట అయిన వరిసాగు చేసేందుకు అవసరమైన సాగు నీరు సమృద్ధిగా ఉన్నా సాగుచేసేందుకు రైతాంగం వెనకంజ వేస్తోంది. కొంతకాలంగా పంట సాగుకు నీరు లేకపోవటంతో మాగాణి పొలా ల్లో పిచ్చి తుమ్మచెట్టు, నల్ల తుమ్మచెట్టు, పిచ్చిబెండ, లింగ మిరప, తుంగ లాంటి గడ్డి,గాదంతో ఏపుగా పెరిగి చిట్టడవులు తలపిస్తున్నాయి.

ఎకరాకు రూ.12 వేల ఖర్చు!

ఈ పరిస్థితుల్లో ఉన్న భూములను సాగుకు తేవాలంటే వ్యవసాయానికే ఎకరాకు రూ.12 వేల రూపాయల వరకు వ్యవసాయ ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. మండలంలో మొత్తం 42,500 ఎకరాలు పంటలు సాగుచేసేందుకు అనువైన భూమి ఉంది. ఆ భూముల్లో 12,500 ఎకరాల్లో సుబాబుల్ తోటలతో పాటు మెట్ట పంటలైన పత్తి, మిర్చి, కంది, కూరగాయల పంటలు సాగు చేస్తారు. 30 వేల ఎకరాలలో వరి పంట సాగుచేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 10 వేల ఎకరాలకు మించి దుక్కులు దున్నలేదు. 5 వేల ఎకరాల్లో సుబాబులు, పండ్ల తదితర తోటలు సాగు అవుతున్నాయి. దుక్కులు దున్నిన 10 వేల ఎకరాల్లో కూడా 7 వేల ఎకరాలు మెట్ట పంటలైన కంది, పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తున్నారు. మిగిలిన 27 వేల ఎకరాల్లో ఇంత వరకు దుక్కులే దున్నలేదు. దున్నాలని కొంతమంది రైతులు ఉన్నా ప్రస్తుత తరుణంలో నెలకొన్న వాతావరణం మెట్ట దుక్కులు దున్నేందుకు అనువుగా లేకపోవటంతో దమ్ము వ్యవసాయం మీదనే ఆధారపడాల్సి వచ్చింది. దీంతో ఎకరా మాగాణి పొలాన్ని దమ్ము చేసి నాట్లు వేయాలంటే రొటోవేటర్ వ్యవసాయానికి రూ.3000లు వరకు, దమ్ము చక్రాల వ్యవసాయానికి రూ.3600లు వరకు ఖర్చు పెట్టాల్సి ఉందని రైతులు వాపోతున్నారు.

పొలాలు బండ బారాయి!

దీనికి తోడు సంవత్సర కాలంగా భూముల్లో ఎలాంటి పంటలు, సాగు దుక్కులు లేకపోవడంతో భూమి బండబారిందని రైతులు వెల్లడించారు. మాగాణి పొలంలోని గట్టు కూడా భూమిలో కలిసిపోవడం వల్ల తిరిగి పొలంలో నీరు నిలబడేందుకు గట్లను పునఃనిర్మాణం చేయాల్సి ఉంది. గట్ల నిర్మాణం యంత్రాలతోనే చేయిస్తేనే ఎకరాకు మడుల సంఖ్యను బట్టి రూ.1500 రూపాయల నుంచి రూ.2500ల వరకు ఖర్చు అవుతోందని రైతుల చెబుతున్నారు.

చిట్ట అడవుల్లా పెరిగిన పొలంలో ఆ చెట్లను జేసీబీ సహాయంతో తొలగించాల్సి వస్తుంది. దీని ఖర్చు మరో రూ.3000లు అదనమైంది. మాగాణి సాగులో నాట్లు వేసిన తర్వాత అనుకోని విధంగా పంటలను చీడపీడలు ఆశించటం, అలాగే ఎలుకలు, అడవిపందుల బెడదతో ఊహించని విధంగా పెట్టుబడి పెరిగేది. ఈ ఏడాది తర్వాత పెట్టుబడి ఎలా ఉంటుందోగాని ఈ ఏడాది మాగాణి వేసే రైతులకు నాట్లు వేయక మునుపే పెట్టుబడి రూ.12 వేలకు పైగా అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కల తొలగింపునకే ఆరువేల ఖర్చు!



సాగు నీరు వస్తుందని రెండు ఎకరాల వరి సాగు చేసేందుకు పనులు ప్రారంభించా. మొదటి రోజు పొలంలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించేందుకు జేసీబీ ఖర్చు రూ.6 వేలు అయ్యింది. వరినాట్లకు అనువుగా భూమిని తయారు చేయాలంటే ఖర్చు రూ.8 వేల వరకు అయ్యేట్లుగా ఉంది. రొటోవేటర్, గొర్రు, దమ్ము చక్రాలతో దమ్ము చేస్తేగాని మాగాణి పొలం నాట్లు వేసేందుకు తయారు కాదు.

– బాలిరెడ్డి, రైతు, మర్రిచెట్టుపాలెం

వ్యవసాయ ఖర్చు పెరిగింది



గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది వ్యవసాయ ఖర్చు పెరిగింది. దీంతో పాటు భూములు అనుకూలంగా లేనందున దుక్కులు ఎక్కువగా దున్నాల్సి వస్తోంది. అందువల్ల ఎకరాకు వ్యవసాయ ఖర్చే రూ.10 వేలకు పైగా అయ్యేటట్లు ఉంది. రైతులం.. వ్యవసాయం చేయక తప్పదని భావించి నాలుగు ఎకరాల్లో వరి సాగు చేసేందుకు పనులు ప్రారంభించాం.

–విప్పర్ల బుడె, రైతు, సంతగుడిపాడు

డాక్టర్ విలియంకేరీ సేవలు భావితరాలకు తెలియచేయాలి



నరసరావుపేట: దేశంలో బాప్టిస్టు సంఘాలకు పితామహుడిగా పేరుపొందిన డాక్టర్ రెవరెండ్ విలియంకేరీ గురించి భావితరాలకు తెలియచేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలుగు బాప్టిస్ట్ కౌన్సిల్ అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. శనివారం విలియం కేరీ 263వ జయంతి వేడుకలను పట్టణంలోని బాప్టిస్టు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేకును కట్ చేశారు. ఈసందర్భంగా పలువురు వక్తలు కేరీ గురించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వారి పేరుపై పోస్టల్ స్టాంప్ విడుదల చెయ్యడం చాల గర్వ కారణమని స్పష్టం చేశారు. పాస్టర్లు ఆశీర్వాదం, అనిల్, జాన్ బాబు, ఏసుపాదం, ఆదాము, దానం, జీవరత్నం, మహిళ పాస్టర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల పాఠశాలకు ఆ పాఠశాలకు చెందిన కె. హైమావతి స్టీల్ బీరువాను శనివారం బహుకరించారు. ఉపాధ్యాయురాలు హైమావతి మనుమడు శ్రీధర్ పుట్టిన రోజును పురస్కరించుకుని బహుమతిని అందజేసినట్లు ఆమె తెలిపారు. పాఠశాల విద్యార్థులతో శ్రీధర్ పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు మిఠాయిలు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరైజర్స్ పంపిణీ చేశారు. బీరువాను బహుకరించిన ఉపాధ్యాయురాలు హైమావతిని సహచర ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

మహిళలపై హింస ఆందోళనకరం

నాదెండ్ల: సమాజంలో బాలికలు, యువతులు, మహిళల పట్ల హింస, దౌర్జన్యాలు పెరగటం ఆందోళనకరమని, స్త్రీల రక్షణకు ప్రభుత్వంతో పాటూ పౌరులు సైతం చైతన్యవంతమైన పాత్ర పోషించాలని న్యాయవాది మాదాసు భానుప్రసాద్ చెప్పారు. గణపవరం సీఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని కేంద్రియ విద్యాలయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన పెంచుకుంటే హక్కుల పరిరక్షణ సాధ్యమన్నారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న దుర్భల దాడులు బాధాకరమన్నారు. ఎన్నో చట్టాలు చేసినా మహిళలపై దాడులు ఆగకపోవటం ఆందోళనకరమన్నారు. ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కులను గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ సభ్యులు వెంకటేశ్వరరావు, జీవీహెచ్ఎస్ ప్రసాద్, న్యాయవాదులు బహుజంకు రాజేష్, ప్రిన్సిపల్ మహమ్మద్ ఫరూక్, ఎస్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

బొల్లాపల్లి: కోల్‌కొత్తాలో జూనియర్ వైద్యురాలి హత్యను నిరసిస్తూ, తక్షణమే న్యాయం చేయాలని మండలంలోని వెల్లటూరు పీహెచ్‌సీ వైద్య అధికారి పి.కృష్ణనాయ్ డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే శిక్షించాలన్నారు. ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వైద్యులకు రక్షణ కల్పిస్తేనే వైద్య సేవలు అందించగలుగుతారన్నారు. మహిళా వైద్యులను రక్షణ కల్పించేలా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గణపవరంలో మాట్లాడుతున్న న్యాయవాది భానుప్రసాద్



బొల్లాపల్లిలో నిరసన తెలియజేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

శావల్యాపురంలో...

శావల్యాపురం: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఈనెల 8న కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై అఘాయిత్యానికి నిరసనగా శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ సారథ్యంలో వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాధాకృష్ణన్ మాట్లాడుతూ కోల్‌కతాలోని ఆర్.జి.కార్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థిని జరిగిన అమానుష అత్యాచారం హత్య పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో సూపర్‌వైజర్ అలవలపాటి ఏడుకొండలు, స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు ఇంకోల్లు నాగలక్ష్మి, దాసరి రాజ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.



శావల్యాపురంలో నిరసన చేస్తున్న వైద్యాధికారి, వైద్యఆరోగ్య సిబ్బంది

పది విద్యార్థులకు 'ట్యాగ్' పరీక్ష

నరసరావుపేట రూరల్: సీబీఎస్ఈ పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 19వ తేదీ సోమవారం నుంచి నిర్వహించాల్సి ఉన్న బేస్‌లైన్ ఎగ్జామ్ విద్యార్థులకు పరీక్షగా మారింది. ఈ పరీక్షకు సంబంధించి శనివారం మధ్యాహ్నం మోడల్ పరీక్ష విద్యార్థులకు నిర్వహించారు. ఈ పరీక్షలో పాల్గొనాలంటే విద్యార్థుల ఐడీతో ట్యాగ్ చేయాల్సి ఉంటుంది. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో 231 మంది పదవ తరగతి విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పాఠశాలలో నెట్ సిగ్నల్ సరిపోకపోవడంతో ఐడీ ట్యాగ్ చేయడంలో అవాంతరం ఏర్పడింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. పాఠశాలలోని ఉపాధ్యాయుల సెల్‌ఫోన్ నుంచి హాట్‌స్పాట్ ద్వారా కొంతమంది విద్యార్థుల ఐడీని ట్యాగ్ చేశారు. ఈ ప్రక్రియ ఆలస్యం అవుతుండటంతో విద్యార్థుల్లో కొంతమందిని ఎంఈవో ఆఫీసుకు, మరికొంత మందిని సమీపంలో వైఫై ఉన్న ఉపాధ్యాయుల ఇళ్లకు పంపించారు. నెట్‌సిగ్నల్ సమస్య కారణంగా విద్యార్థుల ఐడీని ట్యాగ్ చేయడంలో కొంత సమస్య ఏర్పడిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి తెలిపారు. విద్యార్థులు అందరూ పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



పాఠశాలలో ట్యాబ్‌లతో విద్యార్థులు

విత్తనశుద్ధితో రైతులకు ఎంతో మేలు

ఏవో రామారావు

శావల్యాపురం: ఖరీఫ్ సీజనులో వరి పంటను సాగు చేస్తున్న రైతులు విత్తన శుద్ధి చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. శనివారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ నారుమడులు సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాలని, విత్తనశుద్ధి చేయటం ద్వారా అధిక దిగుబడులతో పాటు అనేక ప్రయోజనాలు పొందవచ్చునన్నారు. వరి పంట సాగు చేసే రైతులు ఒక ఎకరం పొలంలో 20 నుంచి 25 కేజీల విత్తనాలను సరిపోతాయన్నారు.

ఎకరాకు 5 సెంట్లు నారుమడిలో విత్తనం చల్లే ముందు ఒక కేజీ నత్రజని, ఒక కేజీ భాస్వరం వాడాలన్నారు. పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పును కలిపి ఎంపిక చేసుకున్న విత్తనాలను పోయగా నీటి అడుగున మునిగి ఉన్న గట్టి విత్తనాలను నారు పోసుకోవాలన్నారు. నారుమడిలో ఆకు తినే పురుగులు సోకకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వరి పంటకు సక్రమించే వివిధ తెగుళ్ల చీడపీడల నివారణకు సస్య రక్షణ చర్యలు రైతులు చేపట్టాలన్నారు. వరి పంట చుట్టూ గట్టుపై కంది పంటను అంతర్ పంటగా సాగు చేయటం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు.



ఎచికలపాలెంలో సాగులో ఉన్న వరి నారుమడి

రాష్ట్రస్థాయి విద్యాభారతి ఆటల పోటీలు



పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు



కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు

- పాల్గొన్న 650 మంది విద్యార్థులు
- రెండు రోజుల పాటు నిర్వహణ

నరసరావుపేట రూరల్: రెండు రోజుల పాటు జరుగనున్న విద్యా భారతి రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు శనివారం ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యాభారతి పాఠశాల్లోని విద్యార్థులు 650 మంది ఈ పోటీలకు హాజరయ్యారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయ కుమార్, ఈశ్వర్ కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కొత్త వెంకట రామకృష్ణ, కన్నా భాస్కరరావు, జిగురు ప్రతాప్‌సింగ్ శాస్త్రి, మిరియాల నాగప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. అతిథులు క్రీడా పోటీల జెండాను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన కవాతు ప్రత్యేక ఆకర్షనగా నిలిచింది. విద్యార్థులకు షటిల్, కబడ్డీ, యోగ, ఖోఖో, చదరంగం, వాలీబాల్‌తో పాటు వ్యక్తిగత పోటీలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు త్వరలో నూతక్కిలో జరిగే ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ విధంగా అఖిల భారత స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతల పేర్లను స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు నమోదు చేస్తారని వివరించారు. పోటీలను 60 మంది పీఈటీలు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల 33/11 కేవీ విద్యుత్‌సబ్‌స్టేషన్‌కు మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ అశోక్‌కుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకూ నాదెండ్ల, చిరుమామిళ్ళ, జంగాలపల్లె, గొరిజవోలు, సంకురాత్రిపాడు, తూబాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

సెప్టెంబర్‌లో స్కూల్ గేమ్స్

నరసరావుపేట రూరల్: అండర్-14, అండర్-17 బాల, బాలికల స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఆటల పోటీలు సెప్టెంబర్ రెండవ వారంలో నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి చప్పల్లి కోటేశ్వరరావు తెలిపారు. లింగంగుంట్లలోని శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు సెప్టెంబర్ మూడవ వారంలో, జిల్లాస్థాయి పోటీలు చివరి వారంలో నిర్వహిస్తామని తెలిపారు. పోటీలకు బాల, బాలికలను సిద్ధం చేయాలన్నారు. పోటీలలో పాల్గొనే వారికి వసతి, భోజన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి ఝాన్సీ, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం లాంగ్వేజిల బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాలను మండల విద్యా శాఖ అధికారి డి. బ్రహ్మేశ్వరరావు ప్రారంభించారు. ఇంగ్లిషు, తెలుగు సబ్జెక్టులలో విద్యాబోధనను రిసోర్స్ పర్సన్స్ వివరించారు. అలవాల, విప్పర్లపల్లి, రొంపిచర్ల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు రొంపిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించగా, వి.రెడ్డిపాలెం, సంతగుడిపాడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు సోమవారం ముగియనున్నాయి.

సమ్మేళనం జయప్రదం చేయండి

నరసరావుపేట ఈస్ట్: విశాఖ ఉక్కు నగరంలో ఈనెల 1వతేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి తెలిపారు.

ఎన్ఈసీలో వన్ క్యాడెట్-వన్ ట్రీ కార్యక్రమం



నరసరావుపేటరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎన్ఈసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో వన్ క్యాడెట్ వన్ ట్రీ కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ మేడికొండ రాజేష్‌బాబు మాట్లాడుతూ సమాజ సేవలో ముందుండే ఎన్‌సీసీ క్యాడెట్స్ మరో సారి సమాజం పట్ల వారికున్న బాధ్యతను గుర్తు చేసుకున్నారని తెలిపారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి ప్రమాదం లేకుండా మానవాళి మనుగడకు అవసరమైన పర్యావరణాన్ని అందించేందుకు మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. కళాశాలలోని 80 మంది క్యాడెట్స్ ఒక్కో మొక్క చొప్పున నాటి వారి సంరక్షణకు చేపడతారని తెలిపారు.